క్లుప్తంగా

నేడు దద్దాల నారాయణ పర్యటన

పామూరు: వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ ప్రచారం శనివారం మండలంలో నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు చిలంకూరు, వీరభద్రాపురం 10 గంటలకు, పడమటి కట్టకిందపల్లె 12 గంటలకు, బొట్ల గూడూరు సాయంత్రం 4 గంటలకు, అయ్యవారి పల్లె సాయంత్రం 6 గంటలకు, అయ్యన్నకోట రాత్రి 8 గంటలకు ప్రచారం ఉంటుందన్నారు. పార్టీ ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం



ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దాత బ్రహ్మారెడ్డి

పీసీపల్లి: వేసవి వడిగాల్పుల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ భవన్ వద్ద చాగం బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీటీసీ గుంటక భాస్కర్, సీనియర్ నాయకులు ఎల్‌ఐసీ వీరపనేని చెన్నారావు, మెంబర్ రాజేష్, మూల రామచంద్రారెడ్డి, మూలరామ కట్టయ్య, బసవయ్య, గోపాల్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

4 నామినేషన్ల తిరస్కరణ

కొండపి (మర్రిపూడి): కొండపి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో శుక్రవారం జరిగిన పరిశీలనలో 4 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఆర్‌ఓ ఎ.కుమార్ తెలిపారు. 25 మంది అభ్యర్థులు 47 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా అందులో 4 నామినేషను తిరస్కరణ గురయ్యాయన్నారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. పరిశీలన అనంతరం వివిధ పార్టీలకు చెందిన 12 మంది అభ్యర్థులు ఉండగా 9 మంది స్వతంత్రులు ఉన్నారన్నారు. బరిలో నిలచిన ప్రధాన పార్టీల్లో యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ తరపున ఆదిమూలపు సురేష్, టీడీపీ నుంచి డోలా బాల వీరాంజనేయస్వామి, ఇండియా నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి పసుమర్తి సుధాకర్‌రావు ఉన్నారన్నారు. తిరస్కరణకు గురైనవారిలో డోలా రాజేశ్వరి, శ్రీపతి ప్రకాశం, మరియమ్మ పసుమర్తి, ఆదిమూలపు విశాల్ ఉన్నారని చెప్పారు.

63 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై సైదుబాబు

పామూరు: మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం సైదుబాబు తెలిపారు. వారి వద్ద నుంచి 63 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

సింగరాయకొండ (మర్రిపూడి): కారులో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యం బాటిల్స్‌ను పట్టుకున్న ఘటన శుక్రవారం పెరల్ డిస్టిలరీ సమీపంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో జరిగింది. తమిళనాడు రాష్ట్రం తిరువూరుకు చెందిన కిట్టి స్వామి కారులో తరలిస్తుండగా తనిఖీల్లో వీటిని పట్టుకున్నట్లు చెక్‌పోస్టు ఇన్‌చార్జి ఎస్‌వీ సాయి వర్షిని, ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. మద్యం టిన్ బాటిల్స్‌తో పాటు కారును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.



మద్యం టిన్ బాటిల్స్ పట్టుకున్న దృశ్యం

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి



స్వాట్ టీంతో డీఎస్పీ రత్నాకర రామరాజు

కనిగిరి రూరల్: ఎటువంటి భయాందోళన లేకుండా ఎన్నికల పర్వాన్ని విజయవంతం చేయడమే లక్ష్యమని ఎన్నికల రిటర్నింగ్ పి.జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం పోలీస్‌శాఖ, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో కవాతు, ప్రదర్శనలు డెమో చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రత్నాకర రామరాజు మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా, ధైర్యంగా సజావుగా ఓటు హక్కు వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలకు ఆత్మరక్షణగా నిలవడమే లక్ష్యంగా తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. సీఐ దాసరి వెంకటేశ్వరరావు, కనిగిరి, పామూరు ఎస్సైలు టి. త్యాగరాజు, శివనాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథికి పట్టం కట్టండి



జరుగుమల్లిలో డాక్టర్ ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి: ఫ్యాన్ గుర్తుపై ఓటేసి సంక్షేమ రథసారథికి తిరిగి పట్టం కట్టాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కొండపి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. జరుగుమల్లి, చింతలపాలెం, పంగులూరివారిపాలెం, కె.బిట్రగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మే 13 న జరుగబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి జగనన్న బలపరచిన అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కొండపి నియోజక వర్గ అసెంబ్లీ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. గతంలో రెండు పర్యాయాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు అంచుల దాకా వచ్చి తక్కువ మెజార్టీతో ఓటమి జరిగిందన్నారు. కానీ నేడు జగనన్న సుస్థిర పాలన, సంక్షేమ పాలన, అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు చెప్పుకునేందుకు ఒక్క పని చేయనివారు నేడు మన ముందుకు వస్తున్నారన్నారు. ఐదు సంవత్సరాల పాలనలో, ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేసిన జగనన్నను ఆశీర్వదించి మరలా ముఖ్య మంత్రిగా చేయాలన్నారు. పిన్నిక శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు బత్తిన మనోహరు, మండల జేసీఎస్ కన్వీనరు తాటికొండ రామచంద్రరావు, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, దుంపా అనిల్ కుమార్ రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.



రామగోపాలపురంలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న దద్దాల నారాయణ

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక

వెలిగండ్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుంటేనే మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని రామగోపాలపురంలో దద్దాల నారాయణయాదవ్ సమక్షంలో మోటుపల్లికి చెందిన తోకల సుధాకర్, ఎడ్ల సుబ్బారావులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నన్ను ఎమ్మెల్యేగా, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, నాయకులు వై నాగూర్‌యాదవ్, దండగ రంగారెడ్డి, రవి, మల్లెబోయిన తిరపతయ్య, సైకం ఏడుకొండలు, బొబ్బా వెంకటరెడ్డి, కె.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

14 నామినేషన్లు తిరస్కరణ



నామినేషన్ల పరిశీలనలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, వివిధ పార్టీల అభ్యర్థులు

కనిగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఆర్వో పాలపర్తి జాన్ ఇర్విన్ అధ్వర్యంలో జరిగిన జరిగిన పరిశీలనలో ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసిన వివిధ పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు. పరిశీలన అనంతరం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో 13 మంది అభ్యర్థుల నామినేషన్లు అర్హత పొందగా, 14 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు తెలిపారు.

అర్హత సాధించిన అభ్యర్థులు

దద్దాల నారాయణ(వైఎస్సార్ సీపీ), ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి(టీడీపీ), దేవరపల్లి సుబ్బారెడ్డి(కాంగ్రెస్), తాతపూడి ప్రభుదాస్ (బహుజన సమాజ్ పార్టీ), ఎస్‌కే అల్లాభక్ష(ఇండియన్ ముస్లిం లీగ్), పందిటి అల్లూరమయ్య(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), ఎస్‌కే నజీర్ బాషా(సమాజ్‌వాది పార్టీ), దమ్ము వెంకటేశ్వర్లు(లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా ఎస్‌కే కుర్షిద్, ఎస్‌కే మస్తాన్‌వలి, దోరడ్ల రాజారావు, షంషీర్ బాషా ముప్పల పాటి, ఎస్‌కే సుభహాన్ అర్హత సాధించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సురేష్



నూతన వధూవరులతో మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి: మండల పరిధిలోని చిరికూరపాడు గ్రామానికి చెందిన నూతన వధూవరులను రాష్ట్ర పురపాలక పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నిక శ్రీనివాసరావు, జరుగుమల్లి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బత్తిన మనోహర్ జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పునన్నారావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ. 291

కొండపి (మర్రిపూడి): కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం అత్యధిక ధర రూ. 291 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.ఈ సీజన్ ఇప్పటి వరకు నిర్వహించిన వేలంలో శుక్రవారం అత్యధిక ధర దక్కిందన్నారు.

టంగుటూరులో రూ. 290

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 290 పలికింది. ఈ వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

మా నాన్నను గెలిపించండి



మూలగుంటపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సురేష్ కుమార్తె క్రిస్టి

సింగరాయకొండ (మర్రిపూడి): మా నాన్నకు ఒక్క అవకాశం ఇచ్చి కొండపి నియోజకవర్గ అభివృద్ధికి మీ వంతుగా సహకరించాలని మంత్రి సురేష్ కుమార్తె క్రిస్టి కోరారు. సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ అల్లూరి సీతారామరాజు రోడ్డు, పేర్రాజు రోడ్డు, పంచాయతీ కార్యాలయం రోడ్డు, గ్యాస్ కంపెనీ ఏరియా, నక్కపాలెం, డాక్టర్ శివరామిరెడ్డి రోడ్డు, తిలక్ రోడ్డులో శుక్రవారం ఇంటింటి ప్రచారం క్రిస్టి నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టి మాట్లాడుతూ తన తండ్రి సురేష్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, రెండుసార్లు మంత్రి అయ్యారని, కొండపి ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల కాలంలో నియోజకవర్గంలో పలు సమస్యలను పరిష్కరించి తానేంటో ప్రజలకు నిరూపించారని వివరించారు. నాలుగు నెలల కాలంలో ఎంతో అభివృద్ధి చేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించారని ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తారని సింగరాయకొండను మున్సిపాలిటీగా మారుస్తారని భరోసా ఇచ్చారు. అంతేకాక పార్టీలు, కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ 1.15 కోట్ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారని ఇది ఆయన గొప్ప పనితనానికి నిదర్శనమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే కొండపిని ఏవిధంగా అభివృద్ధి చేస్తారో గతంలో ఇంతవరకు ఏ అభ్యర్థీ ప్రకటించని విధంగా ప్రత్యేక మానిఫెస్టోను తయారు చేశారని మానిఫెస్టోలో చెప్పిన ప్రకారం ఇచ్చిన హామీలను అమలుపరుస్తారని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీలు దార్ల విజయలక్ష్మి, అంబటి ప్రసాద్, వార్డు మెంబర్ కొడవల మణి,షేక్ సుభాని, గ్రామ కమిటీ అధ్యక్షుడు మిరియం సుధాకర్, మిరియం వెంకటేశ్వర్లు, చుక్కా కిరణ్‌కుమార్,చొప్పర వెంకన్న, దాసు శ్రీను, మోటుపల్లి యానాది, రాయిపేర్రాజు, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, పోలుబోయిన వెంకటేశ్వర్లు, విజయభాస్కర రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వల్లూరి బాలయ్య, క్రాంతి, వెంకటరెడ్డి, అక్బర్, సాహుల్, అల్లా ఉద్దీన్, ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం



ఎన్నికల ప్రచారంలో దద్దాల మంజు భార్గవి, ఇతర నేతలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం జరిగిందని కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ సతీమణి దద్దాల మంజు భార్గవి అన్నారు. మండలంలోని వంగపాడు పంచాయతీలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల మంజు భార్గవి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీల కతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కినట్లు చెప్పారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో రూ.లక్ష నుంచి రూ. 20లక్షల వరకు లబ్ధి జరిగిందని వివరించారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మాజీ ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి, వేయించి దద్దాల నారాయణను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రావుల పల్లి తిరుపతయ్య, నరాల వెంకటరెడ్డి, కదిరి రమణయ్య, రవి, పాశం కొండయ్య, గురుస్వామి, మాజీ ఎంపీటీసీ పేతూరు, ఎస్‌కే మస్తాన్, పోలక సిద్దారెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేసే వ్యక్తి చంద్రబాబు



మాట్లాడుతున్నా తన్నీరు ధర్మరాజు, యనమల మాధవి

కొండపి (మర్రిపూడి): అవకాశాలు ఇస్తానని చెప్పి నిలువున మోసం చేసే వ్యక్తి చంద్రబాబు నాయుడు అని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు అన్నారు. శుక్రవారం కొండపి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వడ్డెర కలస్తులకు ఎమ్మెల్యే సీటు, స్థానిక సంస్థలో సీట్లు ఇచ్చి మమ్మల్ని గౌరవించారన్నారు. ఆ తరువాత ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడు మమ్మల్ని ఎలక్షన్స్‌లో ఓట్ల కోసం వాడుకొని వదిలేశారని నిలువునా మోసం చేశారని ఆయన తెలిపారు. రాజశేఖర్ రెడ్డి ముద్దబిడ్డ, ప్రజల ఆరాధ్యదైవం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత తమకు సముచిత స్థానం కల్పించి, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎంతగానో ముందుకుతీసుకొచ్చారన్నారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. నా అనుకున్నా కుటుంబ సభ్యులే బయటకు నెడుతుంటే దానికి భిన్నంగా ప్రతి మహిళ తన కాళ్లమీద నిలబడే విధంగా చేసిన వ్యక్తి జగన్ అన్నారు. వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుని మూల విగ్రహమూర్తులు



ధ్వజస్తంభం ప్రతిష్టలో అర్చకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని వెంకటాయచెరువులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుని మూలవిగ్రహాల, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టా మహోత్సవం రుత్వికుల వేదమంత్రాల నడుమ వైభవంగా సాగింది. అర్చకులు స్వామి ఉత్సవమూర్తులకు విశిష్ట పూజలు చేసి అనంతరం ప్రతిష్ఠకాంచారు. అనంతరం సీతా, రాముల ఉత్సవమూర్తులకు శాంతికల్యాణం కన్నుల పండువగా సాగింది. ఆలయ కమిటీ, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ తనిఖీ

కనిగిరి రూరల్: పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న డీవి రెస్టారెంట్ అండ్ బార్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ పి.జాన్ ఇర్వీన్ శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. బార్ రెస్టారెంట్‌లో మద్యాన్ని బయటకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్, ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అనే దానిపై విచారణ చేశారు. మద్యం బాటిళ్లను బయటకు విక్రయిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటుమన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేసి తగు నివేదికలు ఇవ్వాలని సెబ్ అధికారులను ఆదేశించినట్లు ఆర్డీఓ చెప్పారు.